ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 3 ఏప్రిల్ 2024



జోరుగా బెట్టింగ్

వ్యసనంగా మారిన ఐపీఎల్ మ్యాచ్‌లు

ఈజీ మనీ కోసం యువకుల ఆరాటం

ఏటా కోట్లతో బెట్టింగ్

పందెం కోసం బైక్‌లు, ఆస్తులు, బంగారం తాకట్టు

అధిక శాతం ఆన్‌లైన్‌లోనే వ్యవహారం

పట్టణం, పల్లె తేడాలేకుండా సాగుతున్న వైనం

హిందూపురం, ఏప్రిల్ 2: ఐపీఎల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బెట్టింగ్ సైతం జోరుగా సాగుతోంది. పట్టణానికి చెందిన ఓ యువకుడికి క్రికెట్ అంటే మహా ఇష్టం. క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగ్ కాసేవాడు. గతేడాది ఐపీఎల్ సందర్భంగా బెట్టింగ్ వేశాడు. ఓడిపోవడంతో తన వద్ద ఉన్న నగదు, బంగారాన్ని పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లోని డబ్బు కాజేసి, పందెంకాసి పోగొట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా ఇంట్లో తల్లిదండ్రులకు తెలీయకుండా దాచిన డబ్బుతో పాటు కుటుంబ సభ్యులు తన పేరు మీద చేసిన స్థలాన్ని విక్రయించి, పోగొట్టుకున్నాడు. అప్పటికీ క్రికెట్ బెట్టింగ్‌లో రాక ఓడిపోవడంతో చేసేదిలేక విషయం తల్లిదండ్రులకు తెలుస్తుందని పట్టణం వదిలి వెళ్లిపోయాడు. ఆ యువకుడు వెళ్లిన కొన్ని రోజులకు తల్లిదండ్రులు ఆరా తీస్తే అసలు విషయం తేలింది. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో చేసేదిలేక అతడిని ఇంటికి తీసుకొచ్చారు. పట్టణానికి చెందిన మరో యువకుడికి పెళ్లి కూడా అయింది. క్రికెట్ మోజులో పడి ఉన్న డబ్బు పోగొట్టుకొని కుటుంబ సభ్యులకు తెలీయకుండా భార్య నగలు తాకట్టు పెట్టి బెట్టింగ్ ఆడాడు. అన్నీ పోగొట్టుకున్నాడు. విషయం తల్లి దండ్రులకు తెలుస్తుందని ఊరు వదిలాడు. అ తరువాత కోడలు చెబితే తల్లిదండ్రులకు అర్థమైంది. దాంతో ఆ యువకుడు ఎక్కడున్నాడో కనిపెట్టాలని పోలీసులను ఆశ్రయించాడు. ఎందుకు వెళ్లాడో చెప్పకుండా దాచారు. పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ఆ యువకుడు డబ్బు ఇవ్వాలని పోలీసులను ఆశ్రయించాడు. దీంతో అసలు విషయం బయటికి వచ్చింది. దీంతో చేసేదిలేక అతడు చేసిన అప్పులు చెల్లించి కుమారుడిని ఇంటికి తీసుకురావాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనలు లేపాక్షి మండలంలో కోకొల్లలు. పరిగి మండలం సరిహద్దులో ఉన్న ఓ మద్యం షాపులో యువకుడు బెట్టింగ్‌కి పాల్పడి యజమానికి తెలీయకుండా రూ.20 లక్షల వరకు పోగొట్టి షాపు నుంచి పరారయ్యాడు. ఆ యువకుడు పరారైన పది రోజుల తరువాత అసలు విషయం తెలిసింది. హిందూపురం పట్టణ పరిధిలోని వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన వారు ఇక్కడ బెట్టింగ్‌లకు పాల్పడి పల్లెలు వదిలినవారు కోకొల్లుగా ఉన్నారు. ఒకప్పుడు క్రికెట్ అంటే సరదాగా చూసేవారు. ఇక వరల్డ్ కప్ మ్యాచ్‌లు అంటే యువకుల నుంచి వృద్ధుల వరకు ఉల్లాసంగా ఆస్వాదించేవారు. ప్రస్తుతం క్రికెట్ అంటే చిన్నారుల నుంచి యువకుల్లో ఏదో తెలియని జోష్ వస్తుంది. క్రికెట్ చూస్తూ ఆటగాళ్లను అనుకరించే క్రికెట్ ఆడే యువత ఇప్పుడు కొత్త పంథాను ఎంచుకుంది. మైదానంలో ఆడాల్సిన ఆటకు ఫుల్‌స్టాప్ పెట్టేసి, అరచేతిలో ఉన్న సెల్‌ఫోన్లు, టీవీల ముందు కూర్చుని, బెట్టింగ్ అనే మహమ్మారిని జీవితాల్లోకి అహ్వానించి, పందేల బాట పట్టారు. దీంతో యువత ఎంతో మంది బెట్టింగ్ వేసి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి ఊర్లు వదిలే పరిస్థితి వచ్చింది. ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ మాసాలు వచ్చిందంటే క్రికెట్ ప్రేమికులకు వినోదం అందించేది. క్రికెట్ బెట్టింగ్‌తో యువత పెడదోవ పడుతున్నారు.

ఈజీ మనీ కోసం...

ఈజీగా డబ్బు సంపాదన ధ్యేయంగా యువత నుంచి వృద్ధుల వరకు జేబులను గుల్ల చేసుకుంటున్నారు. గతంలో నగరాల్లో మాత్రమే ఈ వికృత క్రీడ జరిగేది. ప్రస్తుతం పల్లెలకు కూడా పాకింది. మ్యాచ్ జరిగే సమయంలో యువత చేతిలో డబ్బు లేకపోతే తల్లిదండ్రుల జేబులకు చిల్లులు కూడా పెడుతున్నారు. డబ్బు సంపాదించాలన్న దురాశకు వెళ్లి ఎంతోమంది ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు.

ఏటా కోట్లలో..



ఒకప్పుడు పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ ఆడేవారు కొందరే ఉండేవారు. ఐపీఎల్ వచ్చాక ఏటా పెరిగిపోతున్నారు. దీంతో ముఖ్యమైన జట్లు ఆడే సమయంలో లక్షల నుంచి కోట్లదాకా బెట్టింగ్ కాస్తున్నట్లు తెలుస్తోంది. హిందూపురం పట్టణంలో రోజూ రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బెట్టింగ్ కాస్తున్నట్లు సమాచారం.

తాకట్టు పెట్టి మరీ..




తల్లిదండ్రులకు తమ పిల్లలకు ఎంతో ప్రేమగా గుర్తు పెట్టుకునే విధంగా తీసిచ్చిన బైక్‌లు, కార్లు, బంగారు ఆభరణాలు, స్థలాలను బెట్టింగ్ కోసం క్షణాల్లో తాకట్టు పెట్టడం, అడ్డంగా విక్రయించడం చేస్తున్నారు. దీంతో చాలామంది యువతతోపాటు విద్యార్థులను సైతం తమ చదువులను పక్కన పెట్టి బెట్టింగ్ మోజులో పడుతున్నట్లు సమాచారం. పరీక్షల సమయంలో చదువుకోక టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారని సమాచారం. పిల్లలపై ఉన్న ప్రేమ అభిమానులతో తల్లిదండ్రులను ఏమీ అనలేక మిన్నకుండిపోతున్నట్లు సమాచారం. దీంతో విలువైన నిండు జీవితాన్ని కోల్పోతున్నామని గుర్తించకపోవడం దురదృష్టకరం.

తూతూ మంత్రంగా దాడులు

పెద్దఎత్తున క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నా పోలీసులకు విషయం తెలిసినా నామమాత్రంగా దాడులు చేసి, చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది సిబ్బంది సైతం బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు ఆ శాఖలోనే కోడై కూస్తున్నారు. కొంతమంది క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారికి వడ్డీలకు డబ్బు ఇస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా క్రికెట్ బెట్టింగ్‌తో యువత పెడదోవ పట్టడమే కాక జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్న దాంట్లో సందేహం లేదు.

వ్యవహారమంతా ఆన్‌లైన్‌లోనే..



క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడేవారు ఒకేచోట కూర్చుని బెట్టింగ్ వేసేవారు. మారిన కాలానికి అనుగుణంగా చేతిలో సెల్‌ఫోన్, ల్యాప్ ట్యాప్‌ను తమ వద్ద పెట్టుకొని ఫోన్లు, మెసేజులతోనే ఆన్‌లైన్‌లో జరిగిపోతోంది. డిజిటల్ సేవలను మంచి పనులకు కాకుండా ఇలాంటి తప్పుడు పనులకు ఎక్కువగా ఉపయోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాల్ బాల్‌కీ, పరుగులు, ఓవర్‌కి సిక్సర్, వ్యక్తిగత స్కోరుకి పందెం కాస్తున్నారు. క్షణాల్లో జరిగే ఆటతో జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా కావడంతో పోలీసులకు పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉందని వారు అంటున్నారు. మరీ ముఖ్యంగా ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ క్రీడ బెట్టింగ్ పల్లెలకు కూడా పాకింది.



పుష్పయాగోత్సవంలో శ్రీవారు

శ్రీవారికి విరులయాగం

కనులపండువగా ఖాద్రీశుడి పుష్పయాగోత్సవం

సంప్రోక్షణ అనంతరం గర్భాలయ ప్రవేశం చేసిన స్వామివారు

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పుష్పయాగోత్సవం కోసం తెచ్చిన పూలు

కదిరి, ఏప్రిల్ 2: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీవారికి పుష్పయాగోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ సంప్రోక్షణ, శుద్ధి, పరివార దేవతల అభిషేకం, గోపూజ, హోమాది కార్యక్రమాలు చేశారు. తరువాత యాగశాల నుంచి స్వామి వారి కుంభం, కలశాన్ని గర్భాలయ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారు.. భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి తులసి, కురు, వేరు, కదిరి మల్లెలు, సంపంగి, మరువము, చామంతి, బేబి రోజా, సెంటు రోజా, గన్నేరు, నంది వర్ధనం, కనకాంబరం తదితరాలతో పుష్పయాగోత్సవం నిర్వహించారు. స్వామివారు, భూదేవి, శ్రీదేవిఅమ్మవార్లను అలంకరించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు పుష్పయాగోత్సవంతో ముగిశాయి. 15 రోజుల పాటు ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. అంకురార్పణ నుంచి పుష్పయాగం వరకు ప్రతీ ఉత్సవంలో శ్రీవారు భక్తులకు కనువిందు చేశారు. వాహనాలపై విహరిస్తున్న స్వామివారిని కనులారా వీక్షించి, భక్తులు పరవశించిపోయారు.



శ్రీవారి హుండీ ఆదాయం రూ.45.22 లక్షలు

శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో హుండీ ఆదాయం రూ.45.22 లక్షలు వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. లెక్కింపులో పర్యవేక్షణాధికారిగా రమేష్‌బాబు, ఆలయ సిబ్బంది, కెనరాబ్యాంకు మేనేజర్ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

ఆ రెండింటిపై ఉత్కంఠ



పుట్టపర్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హిందూపురం పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ధర్మవరం మినహా ఆరు చోట్ల అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఆ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జాబితా విడుదల చేశారు. పుట్టపర్తికి మధుసూదన్‌రెడ్డి, పెనుకొండకు నరసింహప్ప, మడకశిరకు మాజీ ఎమ్మెల్యే సుధాకర్, హిందూపురానికి నాగరాజు, రాప్తాడుకు శంకరయ్య, కదిరికి కేఎస్ షానావాజ్‌ను బరిలో దింపింది. ధర్మవరం ఎమ్మెల్యే, హిందూపురం ఎంపీ అభ్యర్థులపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులతోపాటు వైసీపీ అభ్యర్థులను ఖరారుతో ప్రచారం మొదలు పెట్టారు. తొలి జాబితాలో మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పేరు లేకపోవడంతో ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తారా, దూరంగా ఉంటారా అన్న చర్చ సాగుతోంది.



మారణాయుధాలతో రెక్కీ?



పురంలో ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనం

- ఆరాతీయడానికి జంకుతున్న ఖాకీ
- రెక్కీ వెనుక కారణం ఏమిటి?
- నాయకుల్లో ఆందోళన



సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. పోలీసు అధికారులంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నారు. రాజకీయ పార్టీల నేతలు ఓట్లు రాబట్టుకునేందుకు రాత్రింబవళ్లు కుస్తీ పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నాలుగు రోజులపాటు మారణాయుధాలతో ఉన్న ఓ కారు హిందూపురంలో రెక్కీ నిర్వహించినట్లు పలువురు చూసి, అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెక్కీ నిర్వహించిన వాహనంతో పాటు అందులోని వ్యక్తులు కూడా ఈ ప్రాంతానికి చెందిన వారు కాదని కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

- హిందూపురం

పట్టుకోవడానికి జంకుతున్న ఖాకీ



ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనం హిందూపురంలో తిరుగుతుండగా కొంతమంది చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అందులో మారణాయుధాలు ఉన్నట్లు గమనించారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారు వాహనం ఫొటో కూడా తెప్పించుకున్నట్లు సమాచారం. వారి వద్ద మారణాయుధాలు ఉండటంతో వారిని వెంటాడటానికి జంకినట్లు సమాచారం. ఇదేవిషయాన్ని కొంతమంది పోలీసులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో హిందూపురంలో కేంద్ర బలగాలు మోహరించాయి. స్థానిక పోలీసులకు ఒకవేళ భయంగా ఉంటే కేంద్ర బలగాలను రంగంలోకి దింపి ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఉండుంటే అసలు విషయం వెలుగు చూసేదని ఆ శాఖలో కొంతమంది చెబుతున్నారు.

రెక్కీ వెనుక కారణం ఏంటి?


హిందూపురానికి వచ్చి రెక్కీ నిర్వహించడానికి కారణం ఏంటన్నది పోలీసులకు అంతుచిక్కని విషయంగా మారింది. దీనిపై ఆరాతీస్తున్నారు. రాజకీయ నాయకులకు విషయం తెలియడంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారు ఎందుకొచ్చారు, కారణాలేంటో బయటపెట్టాలని ఓ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో పలుచోట్ల పశువుల దొంగలు రెక్కీలు నిర్వహించినట్లు పోలీసుల ద్వారా తెలుస్తోంది. మరికొన్ని చోట్ల పందుల కోసం కూడా ఇలాంటి రెక్కీలు నిర్వహించి, రాత్రిపూట వాటిని ఇక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నాలు చేయవచ్చని భావిస్తున్నారు. ఇదే సందర్భంలో రాజకీయ పార్టీల నాయకులు కూడా ఈ రెక్కీపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని వాపోతున్నారు. వారెవరో, హిందూపురంలో ఎందుకు తిరుగుతున్నారో పోలీసులు నిగ్గు తేల్చాలని కోరుతున్నారు.

షెల్టర్‌జోన్ కోసం పురమా?

కర్ణాటక రాజధాని బెంగళూరుకు హిందూపురం సమీపంలో ఉంది. ఇక్కడికి రవాణా మార్గాలు చాలా ఉన్నాయి. దీంతో ఉత్తరాది రాష్ట్రానికి చెందిన ముఠా ఇక్కడికి వచ్చి హిందూపురాన్ని షెల్టర్‌జోన్‌గా చేసుకుందా? ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఏదైనా ఆపరేట్ చేస్తున్నారా అన్న కోణంలో కూడా పోలీసులు ఆరాతీస్తున్నట్లు సమాచారం. బెంగళూరులో ఇలాంటి ముఠాలు ఉంటాయనీ, అక్కడ ఏదైనా జరిగినప్పుడు కొన్నిరోజులు బయటప్రాంతంలో మకాం వేస్తుంటాయని ఓ పోలీసు అధికారి భావించారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో జిల్లా స్పెషల్ టీమ్ మూడు రోజుల క్రితం హిందూపురానికి వచ్చి సీసీ టీవీ ఫుటేజీని ఆరాతీశారు. ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనా మారణాయుధాలతో రెక్కీ నిర్వహించడం పట్టణ వాసులను భయభ్రాంతులకు లోనుచేస్తోంది.



రంజాన్‌తోఫా కిట్ (ఫైల్)



ముస్లింలకు మోసం!

రంజాన్ తోఫాను అటకెక్కించిన వైసీపీ

- అధికారంలోకి రాగానే పథకం నిలిపివేత
- పండుగకు దూరమౌతున్న పేద ముస్లింలు

టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలన్నింటినీ వైసీపీ అధికారంలోకి రాగానే అటకెక్కించింది. పండుగలను ఆయా మతాలవారు తప్పనిసరిగా చేసుకుంటారు. అన్నివర్గాల వారు సంతోషంగా పండుగ చేసుకోవాలని టీడీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా ముస్లింలకు రంజాన్ తోఫా, సంక్రాంతికి, క్రిస్మస్‌కు కానుకలు అందించారు. దీంతో ఏటా పండుగ అనగానే కానుకలు ప్రభుత్వం అందిస్తుందనీ, ఎవరిమీదా ఆధారపడాల్సిన అవసరం ఉండదని ధీమాగా ఉండేవారు. ప్రస్తుతం రంజాన్ పండుగ వస్తోంది. తోఫాను వైసీపీ రద్దు చేయడంతో ఎంతోమంది పేద ముస్లింలు పండుగకు దూరమవుతున్నారు. టీడీపీ హయాంలో తోఫాను తీసుకుని, సంతోషంగా పండుగ చేసుకునేవారమని ముస్లింలు అభిప్రాయపడుతున్నారు. రంజాన్‌తోఫాతోపాటు సంక్రాంతి, క్రిస్మస్ కానుకలను కూడా రద్దు చేయడంతో ఎంతోమంది పండుగలకు దూరం అవుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా తోఫాతో పండుగ చేసుకునేవారమని ముస్లింలు పేర్కొంటున్నారు. వైసీపీ అధికారం చేపట్టాక పథకాలను తీసేయడంతో పండుగ చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నామన్నారు. పండుగలు వస్తే నూతన వస్త్రాలతోపాటు ఇంటిసరుకులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. టీడీపీ హయాంలో పండగకు సరుకులు ఇచ్చేవారు. నూతన వస్త్రాలను మాత్రం కొనుగోలు చేసేవారమని ముస్లింలు పేర్కొంటున్నారు. కొత్త వస్త్రాలకు డబ్బు లేకపోయినా ప్రభుత్వం ఇచ్చే కానుకలతోనే పండుగ చేసుకునేవారమని వారు చెబుతున్నారు.

- ధర్మవరం రూరల్

రంజాన్ వేళలు



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.35 బుధవారం (సాయంత్రం)	4.51 గురువారం (ఉదయం)
కదిరి	6.32 బుధవారం (సాయంత్రం)	4.58 గురువారం (ఉదయం)
ధర్మవరం	6.37 బుధవారం (సాయంత్రం)	4.55 గురువారం (ఉదయం)
హిందూపురం	6.35 బుధవారం (సాయంత్రం)	4.59 గురువారం (ఉదయం)
పెనుకొండ	6.34 బుధవారం (సాయంత్రం)	4.56 గురువారం (ఉదయం)

తోఫాతో పండుగ సంతోషంగా చేసుకునేవారం



టీడీపీ హయాంలో ఇచ్చే తోఫాతో రంజాన్ పండుగ సంతోషంగా చేసుకునేవారం. ప్రస్తుతం పెరిగిన ధరలతో సరుకులు కొనుగోలు చేయలేకపోతున్నాం.

- ముషీర్, ధర్మవరం

పేదలకు వరంగా ఉండేది



టీడీపీ హయాంలో అందించే తోఫా మాలాంటి పేదలకు ఎంతో వరంగా ఉండేది. ప్రస్తుతం సరుకులు, వస్త్రాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో పండుగ చేసుకోవాలంటే భారంగా మారింది. రంజాన్‌తోఫాను కొనసాగించి ఉండుంటే బాగుండేది.

- నాగూర్‌బీ, ముదిగుబ్బ

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

రొద్దం, ఏప్రిల్ 2: తాగునీటి కోసం మండలంలోని ఆర్ మరువపల్లి బీసీ కాలనీవాసులు మంగళవారం రోడ్డెక్కారు. గ్రామంలో పెనుకొండ-పావగడ రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ సమస్యను పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. గ్రామంలోని వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు కాలనీకి వచ్చే నీటిని వాడుకుంటున్నారనీ, ఆ పైపును తొలగించి, తాగునీటి సమస్య తీర్చాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ కేశవరెడ్డి ఆందోళనకారుల వద్దకొచ్చి మాట్లాడారు. రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు విరమించారు. కార్యక్రమంలో కాలనీవాసులు జయరాం, శ్రీనివాసులు, నారాయణ, శ్రీకాంత్, రఘు, శ్రీనివాసులు, జయశేఖర్, పలువురు మహిళలు పాల్గొన్నారు.



ఆర్.మరువపల్లిలో రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు.. డీఆర్వోకి వినతి



డీఆర్వో కొండయ్యకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి, ఏప్రిల్ 2: వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ సొమ్ము ఇంటివద్దనే పంపిణీ చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్వో కొండయ్యను కోరారు. టీడీపీ నాయకులతో కలిసి బీవీ కలెక్టరేట్‌కు చేరుకుని, డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం దురుద్దేశపూర్వకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మంది వలంటీర్లు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి వైసీపీకి అనుకూలంగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఎన్నికల కమిషన్.. వారిని తప్పిస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు. వైసీపీ నాయకులు దీనిని కప్పిపుచ్చి టీడీపీపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల్లో ఉన్న సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి మహమ్మద్‌రఫీ, నాయకులు గూడూరు ఓబులేసు, రామాంజనేయులు, దయ్యాల ఉమాపతి, మనోహర్, చెన్నప్ప, పీట్ల రమణ పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు (బుధ)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	40.0	25.0
కదిరి	39.0	24.0
ధర్మవరం	41.0	26.0
హిందూపురం	39.0	24.0
పెనుకొండ	39.0	24.0

27,587 జవాబుపత్రాల మూల్యాంకనం

కొత్తచెరువు, ఏప్రిల్ 2: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పది జవాబు పత్రాల మూల్యాంకనం రెండోరోజు మంగళవారం కూడా కొనసాగింది. 27,587 జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి మీనాక్షి తెలిపారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఏప్రిల్ 2: జిల్లాలో వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఎక్కువగా ఎండలో బయట తిరగరాదన్నారు. అత్యవసరమైతేనే ఎండ సమయంలో బయటకు రావాలన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఇంటికే పరిమితం కావాలన్నారు. గ్రామ, వార్డు పంచాయతీ కార్యాలయాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఓ తిప్పేంద్రనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, డ్వామా పీడీ విజయప్రసాద్, విద్యాశాఖ ఏడీ నాగరాజు, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీనరసయ్య, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.




అనంతపురం: వ్యాపారులకు ఎదురుచూపులే..

భగ..భగ..!

● మండిపోతున్న ఎండలు ● 44 డిగ్రీల చేరువలో పగటి ఉష్ణోగ్రతలు


గొడుగులతో విధులకు నర్సులు..

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 2: ఉమ్మడి జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. బయటికి వస్తే భానుడు భగ..భగ మండిపోతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాడు. ఉదయం 9గంటలు దాటితే... బయట అడుగు పెట్టాలంటే జంకుతున్నారు. వీటికి తోడు వడగాల్పులతో ప్రమాదాలు తప్పవని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏప్రిల్‌లోనే... ఉమ్మడి జిల్లాలో 44 డిగ్రీల చేరువకు చేరుతున్నాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి పేర్కొంటున్నారు.



రికార్డు స్థాయిలో నమోదు

మంగళవారం అనంతపురం జిల్లాలో అత్యధికంగా తాడిపత్రిలో 43.23 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. శింగనమల మండలంలో 42.75, బొమ్మనహాళ్ 42.29, శెట్టూరు42.11, పెద్దవడగూరు 42 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, సత్యసాయి జిల్లాలో... తలుపుల 42.05, పరిగి, ముదిగుబ్బ 41.79, కదిరి41.69 కొత్తచెరువు 41.40 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యింది. మిగిలిన మండలాల్లో 40 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యింది.

ప్రస్తుతం ఎల్‌నినో బలహీనపడుతున్నా.. దాని ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు. ఈ ఏడు ఎండలు ఆగస్టు వరకు ఉంటాయంటున్నారు. 10 రోజులుగా ఎండల ప్రభావం జిల్లాలో తీవ్రంగా ఉంది.

వేళలు మార్చుకున్న నేతలు..

ఎన్నికల సందర్భంగా రాజకీయాలూ వేడెక్కాయి. ఎండల్లో నేతలు బయటికి రావాలంటే జంకుతున్నారు. చాలా మండలాల్లో రాజకీయ నేతలు ఉదయం ప్రచారం ముగించుకుని సేద తీరి మరోసారి సాయంత్రం ప్రచారాలకు బయల్దేరుతున్నారు. మధ్యాహ్నం బయటికి రావాలంటేనే హడలెత్తుతున్నారు.


ఇంత ఎండలో బయటకు అవసరమా..?


త్వరగా పద..


తప్పదు.. విధి నిర్వహణ..


రాకపోకలు నిషిద్ధం అన్నట్లు.. సుభాష్ రోడ్డు..


కిటకిటలాడే పాతూరు.. లాక్‌డౌన్ సమయంలో కూడా ఇలా ఖాళీగా లేదు..

బస్సు యాత్రలో యానిమేటర్

సీఎం జగన్ చేపట్టిన 'మేము సిద్ధం' బస్సు యాత్రలో వెలుగు యానిమేటర్ పాల్గొన్నారు. సోమవారం బస్సుయాత్రలో ఎర్రదొడ్డివద్ద వై.కొత్తపల్లిలో పనిచేస్తున్న వెలుగు యానిమేటర్ వెంకటరమణమ్మ రోడ్ షోలో పాల్గొన్నారు. వైసీపీ కార్యకర్తలు, ప్రజలతో కలిసి కోలాట వేశారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన యానివేటర్ ఓపార్టీకి అనుకూలంగా వ్యవహరించడం ఏమిటని చర్చించుకుంటున్నారు.

- కదిరి అర్బన్


కోలాటం ఆడుతున్న యానిమేటర్ వెంకటరమణమ్మ

టీడీపీలో చేరినందుకు..

గుంతకల్లు, ఏప్రిల్ 2: మండలంలోని కొంగనపల్లి గ్రామానికి చెందిన రవి అనే రైతు పొలంలో ఉంచిన స్పింక్లర్లు, నీటి పైపులను దుండగులు మంగళవారం నిప్పుపెట్టి కాల్చేశారు. గత నెలలో గుమ్మనూరు జయరాం టీడీపీలోకి రాగానే వైసీపీ రవి టీడీపీలో చేరారు. పార్టీ మారానన్న అక్కసుతో తనపై కొందరు కక్షగట్టి స్ప్రింక్లర్లు, పైపులకు నిప్పుపెట్టి నష్టపరిచారని రైతు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడు టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామిని కలసి తనకు రూ. 1.70 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయాడు. నారాయణ స్వామి మాట్లాడు తూ ఎన్నికల వేళ ఇటువంటి అకృత్యాలను పోలీసులు అడ్డుకోవాలన్నారు.

ఐ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 2: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కొరకు నిర్వహిస్తున్న ఐసెట్-2024కు దరఖాస్తు చేసుకోవాలని సెట్ నిర్వహణ ఛైర్మన్, ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో కోరా రు. గతనెల 3నుంచి ఆన్‌లైన్‌ద్వారా స్వీకరిస్తున్న దర ఖాస్తుల గడువు ఈ నెల7తో ముగుస్తుందన్నారు. ఏదేని డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిచేసి దరఖాస్తుచేసుకున్న వారికి మే 6,7న పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు https:// cets.apsche.ap.gov.in/ ICET/ICET/ICET_ HomePage. aspx వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయ లక్ష్మీ తెలిపారు. ఈనెల 20 నుంచి 30 రోజుల పాటు ఈ శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. 19-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఆధార్, రేషన్ కార్డు కలిగిన ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలు అర్హులన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 9440905479 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ముసుగు తీశారు..

కదిరి పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన.. పట్నం వద్ద ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఉన్న ముగుసును వైసీపీ నాయకులు తొలగించారు. మేమంతా సిద్ధం బస్సుయాత్ర సందర్భంగా సోమవారం విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించారు. వైసీపీ రంగులతో కూడిన పూలమాలను వైఎస్సార్ విగ్రహానికి వేశారు. కోడ్ ఉల్లంఘన జరిగినా.. అధికారులు చూసీ చూడనట్టు వదిలేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- కదిరి అర్బన్



భూసార పరీక్షలపై నిర్లక్ష్యం

● ఇప్పటిదాకా టార్గెట్ ఇవ్వని ప్రభుత్వం ● వైసీపీ పాలనలో ఊసే లేని వైనం
● భూసార హెల్త్ కార్డుల జారీకీ బ్రేక్ ● గతేడాది నామమాత్రంగా మట్టి పరీక్షలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 2: భూసార పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది భూసార పరీక్షలు నిర్వహించేందుకు ఇప్పటి దాకా ఎలాంటి టార్గెట్ ఇవ్వలేదు. ఏటా ఏప్రిల్, మే మాసాల్లో మట్టి నమూనాలు సేకరించడంతోపాటు భూసార పరీక్షలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఇప్పటి వరకు భూసార పరీక్షలకు సంబంధించి టార్గెట్‌ను ఇవ్వకపోవడం గమనార్హం. గతేడాది ఆలస్యంగా టార్గెట్ ఇవ్వడంతో నామమాత్రంగా భూసార పరీక్షలు నిర్వహించి చేతులేత్తేశారు. ఈ సారైనా సకాలంలో భూసార పరీక్షలు నిర్వహించి, రైతులకు భూసార హెల్త్ కార్డులు అందజేస్తారనుకుంటే ఇప్పటి వరకు టార్గెట్‌పై ఊసేఎత్తకపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్ ఇప్పటికే అమలైంది. ఈ పరిస్థితుల్లో ఈ సారి భూసార పరీక్షలు నిర్వహించడంపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ సాగుతోంది. పంటల సాగులో అత్యంత కీలకమైన భూసార పరీక్షలు తప్పని సరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


శాంపిళ్లు కలియబెట్టే షేకింగ్ యంత్రాలు

హెల్త్ కార్డులకూ దిక్కులేదు..

టీడీపీ హయాంలో ఏటా వేసవిలో భూసార పరీక్షలు నిర్వహించి భూసార హెల్త్ కార్డులు జారీ చేసేవారు. పరీక్షల ఆధారంగా పంటలకు తగిన మోతాదులో ఎరువులు వాడితే మంచి దిగుబడితోపాటు భూసారాన్ని పరిరక్షించే అవకాశం ఉంటుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భూసార పరీక్షలు చేయడాన్ని మానేసింది. 2019-20, 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఒక్క భూసార పరీక్షలు నిర్వహించలేదు. 2014 నుంచి 2019 దాకా 2.67 లక్షల దాకా టీడీపీ ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహించారు. భూసార పరీక్షల ద్వారా పొలాల్లో నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మధాతువులు జింక్, మాంగనీస్, కాపర్, బోరాన్ తదితర పోషకాలు ఏ పరిమాణంలో ఉన్నాయో తెలుస్తుంది. ఆయా పొలాల్లో ఏఏ రకాల పంటలు పండించవచ్చో రైతులు తెలుసుకోవచ్చు. సిఫార్సు చేసిన ఎరువులను తగిన మోతాదులో వాడితే మంచి దిగుబడి వస్తుంది. అయితే గత ఐదేళ్లుగా భూసార పరీక్షలు చేయకపోవడంతో రైతులు ఎడాపెడా పొలాల్లో ఎరువులు వాడటం ద్వారా భూముల్లో సమతుల్యత లోపించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది నామమాత్రంగా పరీక్షలు

గతేడాది ఆలస్యంగా భూసార పరీక్షలకు సంబంధించిన లక్ష్యాన్ని ఇచ్చారు. 2023-24 ఖరీఫ్‌లో 10వేల మట్టి నమూనాల సేకరణ, రబీలో 36,745 భూసార పరీక్షలు ని ర్వహించాలని నిర్ణయించారు. రెండు సీజన్లల్లో మొత్తం 46,745 మట్టినమూనాల సేకరించి భూసార పరీక్షలు నిర్వహించాలని టార్గెట్ విధించారు. అయితే అందులోనూ అధికారులు నిర్లక్ష్యం వహించారు. నామమాత్రంగా భూసార పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. కేవలం 10వేల మట్టి నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించడంతో సరిపెట్టారు.



అనంత భూసార పరీక్షా కేంద్రం

ఉమ్మడి జిల్లాలకు అనంత కేంద్రమే దిక్కు

గతంలో అనంత జిల్లా కేంద్రంలోని భూసార పరీక్షా కేంద్రంతోపాటు ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లో భూసార పరీక్షా కేంద్రాల్లో మట్టి పరీక్షలు చేస్తూ వచ్చారు. అయితే ఈ ఐదేళ్లలో ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లోని భూసార పరీక్షా కేంద్రాలను మూసేశారు. ఉమ్మడి జిల్లాలోని మట్టినమూనాల పరీక్షలకు అనంత భూసార పరీక్షా కేంద్రమే దిక్కుగా మారింది. నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన అగ్రి ల్యాబ్‌లోనే మట్టి నమూనాల పరీక్షలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ ఉన్నతాధికారులు ప్రకటిం చారు. అగ్రి ల్యాబ్స్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారు. భూసార పరీక్షలకు సంబంధించిన అగ్రి ల్యాబ్స్‌లో మట్టి పరీక్షలు చేసేందుకు అవసరమైన పరికరాలు ఇవ్వలేదు. అక్కడ మట్టి పరీక్షలు నిర్వహించడం లేదు.


మూతపడిన ధర్మవరం, పెనుకొండ భూసార పరీక్ష కేంద్రాలు

ఇంకా టార్గెట్ రాలేదు : రోజా పుష్పలత, ఏడీఏ



టార్గెట్ కోసమే ఎదురుచూస్తున్నాం. ఈ ఏడాది వేసవిలో భూసార పరీక్షలకు సంబంధించి ఇంకా టార్గెట్ రాలేదు. ఉన్నతాధికారుల నుంచి టార్గెట్ ఇవ్వగానే క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టి నమూనాలు సేకరించి పరీక్షా కేంద్రానికి పంపిస్తారు. మట్టి నమూనాలు వచ్చి తర్వాత పకడ్బందీగా భూసార పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

కూతురిపై అత్యాచారం

తండ్రిపై పోక్సో కేసు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 2: రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో కన్న కూతురిపై తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో బాధిత బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. ప్రభుత్వ వసతి గృహంలో ఉంటున్న బాలిక.. ఆదివారం సెలవు కావడంతో ఇంటికి వెళ్లింది. హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. అదే రోజున బాలిక తండ్రి చేతిలో అత్యాచారానికి గురైంది. బాధితురాలిని మరుసటి రోజున తాత హాస్టల్లో వదిలివెళ్లాడు. బాలిక దిగులుగా ఉండటం, అధికంగా రక్తస్రావం కావడంతో వార్డెర్ ఆరా తీశారు. విషయం తెలిగానే జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. బాలికకు వైద్య పరీక్షల నిర్వహించిన అనంతరం స్పష్టత వస్తుందని తెలిపారు.

అప్పు చెల్లించలేదని కిడ్నాప్?

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 2: అప్పు తిరిగి చెల్లించని వ్యక్తిని కిడ్నాప్ చేస్తూ.. రోడ్డు ప్రమాదంతో దొరికిపోయారు. ధర్మవరం మండలం తుంపర్తి జగనన్న కాలనీలో మంగళవారం ఓ ఇంటిని కారు ఢీకొనడంతో కిడ్నాప్ ఉదంతం వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన మేరకు.. హైదరాబాద్‌కు చెందిన మురళి అనే వ్యక్తి అదే నగరానికి చెందిన విజయ్‌కు దాదాపు రూ.2 లక్షలు అప్పు ఇచ్చాడు. విజయ్ అప్పు తిరిగి చెల్లించకలేదు. కొన్ని నెలల క్రితం చెన్నేకొత్తపల్లి మండలం యర్రోనిపల్లిలోని బంధువుల వద్దకొచ్చి, అక్కడే రాళ్ల కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న మురళి, తన అనుచరులతో గ్రామానికి వెళ్లాడు. తన అప్పు చెల్లించాలని విజయ్‌పై ఒత్తిడి తెచ్చాడు. అప్పు చెల్లించే పరిస్థితిలో లేనని అనడంతో కారులో బలవంతంగా ఎక్కించుకుని ధర్మవరం మీదుగా హైదరాబాద్ బయల్దేరారు. మార్గం మధ్యలో తుంపర్తి సమీపాన జగనన్న కాలనీ వద్దకు రాగానే విజయ్ వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. వెనుక కూర్చున్న విజయ్ ఒక్కసారిగా కారు స్టీరింగ్‌ను తిప్పాడు. దీంతో వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి కాలనీలో కొండారెడ్డి ఇంటిని బలంగా ఢీకొంది. దీంతో ఇంటి ముందుభాగం దెబ్బతింది. కారులోని వారు సురక్షితంగా బయటపడ్డారు. ఇంటి యాజమానితోపాటు స్థానికులు.. వారిని పట్టుకుని కారుతోపాటు రూరల్ పోలీసుస్టేషన్‌కు అప్పజెప్పారు. ఇళ్లు దెబ్బతిందని, పరిహారం ఇప్పించాలని యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా కిడ్నాప్ ఉదంతం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. బాధితుడు విజయ్.. కిడ్నాపర్లపై ఫిర్యాదు చేయకపోవడంతో ఇంటి యాజమాని ఇచ్చిన ఫిర్యాదునే పోలీసులు పరిగణనలోకి తీసుకుని కేసు నమోదు చేశారని సమాచారం. ఇంటిని కారు ఢీకొట్టినట్లు ఫిర్యాదు చేశారని, కిడ్నాప్‌పై ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్‌ఐ నరేంద్ర అన్నారు. కారులో ఉన్న వారు బంధువులని తెలిపారని, దీంతో ఇంటి యాజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

ఏంటి ముఠాను నడుపుతున్నావా..?

● ఇష్టానుసారం విధులు కేటాయిస్తారా..? ● హెచ్‌ఎంలు కాకుండా ఎంఈఓలతో పనేంటి..?
● టెన్త్ స్పాట్‌లో ఏసీపై ఆర్‌జేడీ ఫైర్ ● సెలవులో వెళ్తానంటూ.. ఏసీ అలక ● బుజ్జగించిన డీఈఓ

అనంతపురం విద్య, ఏప్రిల్ 2 : "ఏంటి ముఠాను నడుపుతున్నావా..? ఇష్టానుసారం విధులు వేసేస్తావా.. రూల్స్ ఫాలో కావా.." ఆర్‌జేడీ ఫైర్ అయ్యారు. టెన్త్ క్లాస్ పరీక్షలు, స్పాట్ విషయంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్ నాయక్ ఏకపక్షంగా వ్యవహరించడంపై కడప ఆర్‌జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లా పరీక్షల పరిశీకులు రాఘవరెడ్డి తీవ్ర స్థాయిలో ఫైర్ అయినట్లు సమాచారం. పది పరీక్షల విధులు, స్పాట్‌లో ఏకపక్షంగా వ్యవహరిస్తూ...కొందరికే పెద్దపీట వేయడంపై ఇటీవల కొందరు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మధ్యాహ్నం కేఎస్‌ఆర్ హైస్కూల్, జూనియర్ కాలేజీ పరిసరాల్లో జరుగుతున్న 10వ తరగతి పరీక్షల మూల్యాంకనాన్ని ఆర్‌జేడీ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపై తీవ్ర స్థాయిలో మండిపడినట్లు తెలిసింది. ఇష్టారాజ్యంగా విధులు కేటాయిస్తావా...?, స్పాట్‌కు ప్రధానోపాధ్యాయులను కాకుండా, ఎంఈఓలకు ఎలా విధులు వేస్తారంటూ...అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆగమేఘాల నలుగురు ఎంఈఓలు రవినాయక్, గురుప్రసాద్, ఓబుళపతి, క్రిష్ణయ్యను ఆర్‌జేడీ రిలీవ్ చేస్తూ...ఆదేశాలు జారీ చేశారు. వారి స్థానంలో నలుగురు హెచ్‌ఎంలను స్పాట్ విధుల్లో నియమించారు. ఆర్‌జేడీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, ఈ హఠాత్ పరిణామంతో... ఏసీ గోవింద్ నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు స్పాట్‌లోని ఉపాధ్యాయుల ద్వారా తెలుస్తోంది. తాను సెలవుపై వెళ్తానంటూ.... అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. తర్వాత డీఈఓ వరలక్ష్మి పిలిపించి బుజ్జగించినట్లు తెలుస్తోంది. అయితే ఘటన టెన్త్ స్పాట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



టీడీపీలోకి పలువురి చేరిక



టీడీపీలో చేరినవారితో కందికుంట

గాండ్లపెంట, ఏప్రిల్ 2: మండలపరిధిలోని మల్లమీదపల్లి పంచాయతీలోని వైసీపీ నాయకులు మంగళవారం కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో టీడీపీలోకి చేరారు. రామాంజులు, చంద్ర, రామమోహన్, నరసింహులు, రామచంద్ర, రమణ, శ్రీనివాసులు, సంతోష్, అంజనప్పతోపాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆదెప్పనాయుడు, వెంకటనారాయణ, రమణ, రఘు, రామాంజి పాల్గొన్నారు.

కదిరి: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కూటమి అభ్యర్థి కందికుంటవెంకటప్రసాద్ కోరారు. మంగళవారం తలుపుల మండలంలోని శింగనపల్లి, గుండువారిల్లిలలో ప్రచారం చేశారు. ఆయనకు ప్రతి గ్రామంలో ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని కందికుంట కోరారు. శింగనపల్లిలో జయహో బీసీ సదస్సును నిర్వహించారు. బీసీలే టీడీపీ ఆయువు పట్టు అని అన్నారు. కార్యక్రమంలో తలుపుల మండల కన్వీనర్ ముబారక్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

గాండ్లపెంట: మండలంలోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహిస్తున్న టీడీపీ ఆత్మీయ సమ్మేళనానికి తరలి రావాలని నాయకులు కోరారు. మంగళవారం మాజీ సింగల్‌విండో డైరెక్టర్ వెంకటరమణారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారని చెప్పారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, ఆనంద్, అక్రమ్, రంగరామిరెడ్డి, బావా, ఆంజనేయులు, అమీర్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి: బీజేపీ



సమావేశంలో చర్చిస్తున్న నాయకులు

నంబులపూలకుంట, ఏప్రిల్ 2: కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషిచేద్దామని బీజేపీ మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ బాబ్‌జాన్ సూచించారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాల మేరకు ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌కు గెలుపునకు కృషిచేయాలని కోరారు. సమావేశంలో ఉత్తమరెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు సుదర్శన్, అశోక్, ఇంతియాజ్, చంటి, షేక్ బాబ్‌జాన్, మండలాధ్యక్షులు చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీపై రాజకీయమా..?

- టీడీపీ నాయకులు



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

తనకల్లు, ఏప్రిల్ 2: పింఛన్ పంపిణీపై కూడా వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శించారు. పింఛన్‌ను పెంచిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. మంగళవారం తనకల్లు మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పింఛన్ పంపిణీపై వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. వేయి పెంచితే అధికారంలోకి రాగానే రూ.4వేలు చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించడం జరిగిందన్నారు. సచివాలయంలో ఉద్యోగులు ఉన్నారని, వారిచేత పింఛన్ పంపిణీ చేయించాలన్నారు. ఇప్పటికైనా టీడీపీపై బురదచల్లడం వైసీపీ నాయకులు మానుకోవాలని హితవుపలికారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో మల్లికార్జున, శ్రీరాములనాయక్, ఉతన్ననాయక్, దస్తగిరి, రవి, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: ఇళ్లవద్దకే వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రామానాయక్‌కు మంగళవారం టీడీపీ నాయకులు ఆనంద్, అక్రమ్ బాషా, యూనూస్ వినతిపత్రం అందించారు.

కదిరిఅర్బన్: సామాజిక పింఛన్లను ఇళ్ల వద్దే ఇవ్వాలని మంగళవారం ఎర్రదొడ్డ పంచాయతీ కార్యదర్శి శారదకు టీడీపీ నాయకులు ఉపేంద్రరెడ్డి, ఈశ్వర్‌నాయక్, శంకర్‌రెడ్డి, ఆంజి వినతిపత్రం అందజేశారు.

నంబులపూలకుంట: పింఛన్ మొత్తాన్ని వెంటనే పంపిణీ చేయాలని టీడీపీ మండలకన్వీనర్ సోముశేఖర్ నాయుడు, దండో రవి, ఆంజనప్పనాయుడు, గంగశేఖర్, నరసింహులు, శ్రీరాములనాయుడు మంగళవారం ఎంపీడీఓ ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు.

ఓబుళదేవరచెరువు: ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఇవ్వాలని ఆర్పీపీ డివిజన్ కార్యదర్శి మున్నా, రామచంద్ర, బీజేపీ నాయకుడు రామచంద్ర మంగళవారం ఎంపీడీఓ వరలక్ష్మీకి వినతిపత్రం అందించారు.

ధర్మవరంరూరల్: పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు మద్దిలేటి, మేకల రామాంజినేయులు, పోతుకుంట లక్ష్మన్న, గొట్లూరు శ్రీనివాసులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ అబ్దుల్‌నబీకు వినతిపత్రం అందించారు.

కొత్తచెరువు: ఇళ్ల వద్దకే పింఛన్ పంపిణీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్దారెడ్డికి టీడీపీ మండలకన్వీనర్ అడపాల రామకృష్ణ, పట్టణ కన్వీనర్ ఒలిపిశీన, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ మంగళవారం వినతిపత్రం అందజేశారు.

వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు రద్దు

కొత్తచెరువు, ఏప్రిల్ 2: ముస్లింలకు తెలుగుదేశం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అధికారంలోకి రాగానే జగన్ రద్దు చేశాడని టీడీపీ మాజీ సర్పంచ్ మాణిక్యంబాబా, నాయకుడు సైకిల్‌షాపు బాబా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ముస్లింలకు జగన్ చేసిందేమీలేదన్నారు. చంద్రబాబు వెంటే ముస్లింలు ఉంటారన్నారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు పల్లె రఘునాథరెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారని, ముస్లింలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిమెంట్ మౌలా, రఫీ, షబ్బీర్, అస్లాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబా

ధర్మవరం.. సమస్యాత్మకం

ఎన్నికల వేళ ఐపీఎస్ స్థాయి అధికారిని నియమిస్తే మేలు అంటున్న ప్రజలు

వైసీపీ పాలనలో అధికమైన దాడులు, దౌర్జన్యాలు



ధర్మవరంరూరల్, ఏప్రిల్ 2: ధర్మవరం అంటేనే సంచలన రాజకీయాలకు పెట్టింది పేరు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయంగా ఎప్పుడు ఏ సంఘటన జరుగుతుందో కూడా ఊహించని పరిస్థితి ఈ డివిజనల్‌లో ఉంటుందని రాజకీయపార్టీలు, పలువురు ప్రముఖులు పేర్కొంటున్నారు. ప్రధానపార్టీల నాయకులు రాజకీయంగా బలమైన వారు కావడంతో నువ్వ నేనా అన్నరీతిలో పోటీ ఉంటుంది. ధర్మవరం డివిజన్‌లో ఏ చిన్న సంఘటన జరిగినా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాశంగా మారుతుంది. గతంలో జరిగిన సంఘటనలు దృష్ట్యా ఈ ప్రాంతంలో ఏ చిన్న ఘర్షణ జరిగినా సంచలనం అవుతుంది. ధర్మవరం డివిజన్ పరిధిలో ధర్మవరం, రాప్తాడు రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో సమస్యాత్మక గ్రామాలు ప్రతి మండలంలోనూ ఉన్నాయి. అటువంటి ప్రాంతమైన ధర్మవరం డివిజన్‌కు ఎన్నికల వేళ ఐపీఎస్ అధికారి అయితేనే మేలని, అప్పుడే పూర్తిస్థాయిలో శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ధర్మవరం డివిజన్ పరిధిలో ధర్మవరం పట్టణం, ధర్మవరంరూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, పట్నం, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలు ఉన్నాయి.

గతంలో పనిచేసిన ఐపీఎస్ అధికారులు

ధర్మవరంలో ఇప్పటివరకు 8మంది ఐపీఎస్ అధికారులు తేజ్‌దీప్‌ప్రత్యుష, వినయ్‌రంజన్‌రే, ద్వారకతిరుమలరావు, అంజనసిన్హా, కృపానందత్రిపతిఉజ్వల్, మనీష్‌కుమార్‌సిన్హా, అకున్‌సబర్వాల్, అభిషేక్ మహంతి పనిచేశారు. ఐపీఎస్ అధికారులు పనిచేసినప్పుడు శాంతిభద్రతలు గాడిలో పెట్టినట్లు, అదేవిధంగా ఫ్యాక్షన్‌పై ఉక్కుపాదం మోపి శాంతిభద్రతలను అదుపులో పెట్టినట్లు చర్చ సాగుతోంది. అదేవిధంగా ధర్మవరం పట్టణంలో దొంగనోట్ల చెలామణి, దోపిడీలు, ఫ్యాక్షన్ ఘటనలపై ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతి ఉక్కుపాదం మోపి కట్టడి చేసినట్లు పట్టణ ప్రజలు అంటున్నారు. అదేవిధంగా మనీష్‌కుమార్‌సిన్హా, అకున్‌సబర్వాల్, అంజనసిన్హా ఫ్యాక్షన్‌ను కట్టడి చేశారు. ఈ నేపథ్యంలో ఐపీఎస్ అధికారులను నియమిస్తే పరిపాలన పరంగా గానీ, శాంతిభద్రతలు కాపాడటంలో గానీ రాజీపడరన్న భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. ఇటీవల జరిగిన కొన్ని సంఘటన దృష్ట్యా డీఎస్పీ కార్యాలయం సమీపంలోనే పట్టపగలే ధర్మవరంలో బీజేపీ నాయకులపై దాడి, టీడీపీ నాయకులు, ఐటీడీపీ ప్రతినిధులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. వీటితోపాటు ఇతర మండలాల్లో సంఘటనలు చోటుచేసుకున్న పరిణామాలతో పాటు రానున్న ఎన్నికల దృష్ట్యా ఐపీఎస్ లాంటి అధికారే మేలు అన్న భావన ప్రజలు నుంచి వ్యక్తమవుతోంది.

వైసీపీ పాలనలో ఇటీవల జరిగిన దాడులు..

- పట్టణంలో డీఎస్పీ కార్యాలయం సమీపంలో కూతవేటు దూరంలో పట్టపగలే ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ నాయకులపై వైసీపీ గుండాలు కట్టెలతో, రాడ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు.
- ధర్మవరం టీడీపీ సోషియల్ మీడియా ప్రతినిధులపై పోస్టింగ్‌లు పెట్టారనే నెపంతో వైసీపీ నాయకులు దాడిచేశారు.
- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ధర్మవరం మండలం వెంకటతిమ్మాపురం గ్రామంలో బీజేపీ తరపున ఏజెంట్‌గా కూర్చున్న నారాయణస్వామిపై వైసీపీ గుండాలు పోలింగ్ కేంద్రం నుంచి ఈడ్చుకొని వచ్చి గ్రామ సమీపంలో దాడిచేసి వదిలేశారు.
- పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కాలేజ్‌సర్కిల్‌లో టీడీపీ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలను అధికారపార్టీకి చెందిన కొంతమంది మూకలు చించివేశారు.
- ముదిగుబ్బ మండలంలో అధికారపార్టీ నాయకులు ఆగడాలు మితిమీరిపోయాయని, అధికారులను సైతం ఫోన్‌లలో బెదిరించిన సంఘటనలు ఉన్నాయి. ప్రతిపక్షపార్టీ నాయకుల మీద దాడులు దౌర్జన్యాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి.
- బత్తలపల్లి మండలంలో పత్యాపురం గ్రామంలో ఓ టీడీపీ వర్గీయుడు వైసీపీ వర్గీయుల దాడిలో మృతిచెందాడు. అదేవిధంగా బత్తలపల్లిలో కూడా ఎస్సీవర్గానికి చెందిన ఓ వ్యక్తిని వైసీపీ నాయకులు దాడి చేసి హతమార్చారు. ఆ మండలంలో కూడా దాడులు, దౌర్జన్యాలు జరిగినట్లు తెలుస్తోంది.
- తాడిమర్రిలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గణేష్, గడ్డంపల్లిలో కురుబ సామాజిక వర్గానికి చెందిన గంగయ్య, చిల్లకొండయ్యపల్లిలో కొంతమంది సాగుచేసిన చీనీచెట్లను నరికివేశారు. వీటితోపాటు పలుగ్రామాల్లో దాడులు, దౌర్జన్యాలు చేసినట్లు మండలవాసులు పేర్కొంటున్నారు.
- కనగానపల్లి మండలం మద్దలచెరువు గ్రామానికి పరిటాలసునీత ఎన్నికల ప్రచారానికి వెళ్లడంతో అక్కడ వైసీపీ వర్గీయులు ఆ పార్టీ జెండాలతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. జెండాలు పట్టుకుని రెచ్చగొడుతున్న వైసీపీ వర్గీయులను వదిలి టీడీపీ వర్గీయులను మాత్రమే పోలీసులు వీడియో తీయడంతో అక్కడున్న వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లో వైసీపీ వర్గీయుల దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నికలు వచ్చాయంటే ఆ మండలాల్లో భయంభయంగా గడపాల్సి ఉంటుంది.

సమస్యాత్మక గ్రామాలివే..

ధర్మవరం డివిజన్ పరిధిలో ప్రతి మండలంలో సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. గతంలో ఆయా గ్రామాల సంఘటనలు బట్టి పోలీసుల రికార్డుల ప్రకారం సమస్యాత్మక గ్రామాలుగా నమోదు చేశారు. మండలాల వారీగా పరిశీలిస్తే ధర్మవరం రూరల్ పరిధిలో కామిరెడ్డిపల్లి, రావులచెరువు, రేగాటిపల్లి, నేలకోట, ఓబుళనాయునిపల్లి, తిప్పేపల్లి, బడన్నపల్లి, బత్తలపల్లి మండలంలో పత్యాపురం, గర్శినపల్లి, అప్రాచెరువు, ఈదుల మూష్టురు, తాడిమర్రి మండలంలో దాడితోట, చిల్లవారిపల్లి, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి, ముదిగుబ్బ మండలంలో ఇందూకురు, కొడవండ్లపల్లి, మంగళమడక, మల్లేపల్లి, ఈదులపల్లి, గాండ్లవారిపల్లి, గుట్టకిందపల్లి ఉన్నాయి. కనగానపల్లి మండలంలో తూంచెర్ల, భానుకోట, మద్దలచెరువు, తగరకుంట, ఏలక్కుంట్ల, కుర్లపల్లి, చెన్నేకొత్తపల్లిలో మేడాపురం, వెంకటంపల్లి, న్యామద్దల, నాగసముద్రం, బసినేపల్లి, రామగిరి మండలంలో కుంటిమద్ది, మాదపురం, నసనకోట, పోలేపల్లి, కలికివాండ్లపల్లి, పెనుబోలు గ్రామాలు ఉన్నట్లు పోలీసుల రికార్డులే చెబుతున్నాయి.



ఒక్కొక్కరికి ఒక్కోలా బైండోవర్..

ధర్మవరం డివిజన్ పరిధిలో ఒక్కొక్కరికి ఒక్కోలా బైండోవర్ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలు కేసులలో ఉన్న ప్రతిపక్షనాయకులకు సంబంధించి పోలీసులు బైండోవర్ చేస్తున్నారని, అధికారపార్టీకి చెందిన వారిని మాత్రం గుట్టుచప్పుడు కాకుండా స్టేషన్‌కు పిలిపించుకుని చేస్తున్నారని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

జయహో బీసీ సదస్సులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

బుక్కపట్నం, ఏప్రిల్ 2: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. బుక్కపట్నం మండలంలోని పాముదుర్తి వైసీపీ సర్పంచ్ జ్యోతితోపాటు మూడువందల కుటుంబాలు టీడీపీలో చేరారు. మంగళవారం పాముదుర్తిలో జయహో బీసీ సదస్సు జరిగింది. పల్లె రఘునాథరెడ్డి, పార్లమెంటు కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, జనసేన పుట్టపర్తి ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్, టీడీపీ జిల్లాప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అనంతరం పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. పార్థసారథి మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలన్నారు. సింధూరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలన్నారు. వెంకటరాముడు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలూ టీడీపీవెంటే ఉన్నారన్నారు. పత్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను కలిసి కట్టుగా గెలిపించాలన్నారు. సదస్సులో గాండ్ల విశాలాక్ష్మి, మండలకన్వీనర్ చింతా మల్లిరెడ్డి, గోపాలపురం గంగాధర్, గంగా ప్రసాద్, అప్పస్వామి, శివారెడ్డి, బొట్టు క్రిష్టప్ప, మహిళనాయకులు లావణ్యగౌడ్, యశోదా రాయుడు, తెలుగుయువత సాకే నరేష్, అంబులెన్స్ రమేష్, మురళీ, సుధీర్; శ్రీనివాసరెడ్డి సతీష్‌రాయల్, భాస్కర్‌రాయల్, జనసేన శ్రీనివాసులు, పూల శివప్రసాద్, బిజెపీ చెన్నప్ప, నాయకులు, కార్యకర్తలు, అభిమానులున్నారు.



మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవరచెరువు: మండలంలోని కొండకమర్ల పంచాయతీలోని గజ్జిబండతండాకు చెందిన 15 వైసీపీ కుటుంబాలు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుక్కపట్నం మండలంలోని పాముదుర్తిలో జరిగిన బిసి గర్జనలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. జయనాయక్, ప్రసాద్‌నాయక్, చంద్రనాయక్, వెంకటేష్‌నాయక్, రాజునాయక్, మంగమ్మ బాయి, కుమావత్ శాంతమ్మ, లక్ష్మీదేవి బాయి, శాంతిబాయి, సాకేబాయితోపాటు కొండమకమర్ల పంచాయతీకి చెందిన ఇమ్రాన్, నాగరత్నం, మురళి తదితరులు చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, జాకీర్‌అహమ్మద్, రాజారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు, బీసీ సెల్ ఆంజనేయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నియోజకవర్గంలోని కృష్ణాపురం, మారాల, నల్లమాడ, కొండ్రోల్లపల్లి, కప్పలబండకు చెందిన 20 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. గంగరాజు, నరసింహా, నారాయణ, అంజినమ్మ, నాగేంద్రమ్మ, లక్ష్మిరంగమ్మ, గోవిందరెడ్డి, లక్ష్మమ్మ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో సామకోటి ఆదినారాయణ, గంగారాజు, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలి

ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ధర్మవరం నాయకులు

ధర్మవరం, ఏప్రిల్ 2: చేనేత 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ధర్మవరం తాలూకా అధ్యక్షురాలు జయశ్రీ, గౌరవాధ్యక్షుడు గడ్డం పార్థసారథి డిమాండ్ చేశారు. జయశ్రీ స్వగృహంలో మంగళవారం ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడారు. ధర్మవరంలో అన్ని వర్గాల ప్రజలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, అలాంటి చేనేత పరిశ్రమ నిర్వీర్యం అయిందన్నారు. ఇందుకు కారణం ప్రభుత్వాలు చేనేతలపై చూపిస్తున్న సవతి ప్రేమేనన్నారు. కొంతకాలంగా జరుగుతున్న చేనేతల ఆత్మహత్యలను నివారించాలని కోరారు. బ్యాంకుల్లో చేనేత కార్మికులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలన్నారు. 90శాతం సబ్సిడీతో ముడిసరుకులను ఇవ్వాలని, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. విద్యాసంస్థలతోసహా అన్ని ప్రభుత్వ సంస్థల్లో చేనేత వస్త్రాలనే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. చేనేత కార్మికులకు 45ఏళ్లకు పింఛన్ ఇవ్వాలని, ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలన్నారు. టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటుచేయాలన్నారు. సమావేశంలో ఆలిండియా వీవర్స్‌ఫెడరేషన్ సభ్యులు శేషాద్రి, గంగాధర్, ప్రవీణ్, కృష్ణమూర్తి, రమేశ్, నారాయణస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేస్తున్నారు

న్యాయం చేయండి

బాధితుల వేడుకోలు

పుట్టపర్తి, ఏప్రిల్ 2: వైసీపీ నాయకులు తమ స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని ముదిగుబ్బకు చెందిన చిట్టెమ్మ, లింగమనాయుడు అన్నారు. మంగళవారం సాయి ఆరామంలో వారు విలేకరులతో తమగోడు వెల్లబోసుకున్నారు. 2018లో తెలుగుదేశం ప్రభుత్వం నాలుగు సెంట్ల భూమికి సంబంధించి పట్టా ఇచ్చారని, ఇందులో ఇంటిని నిర్మిస్తుండగా వైసీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. గుంజేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 826, 1190-1, 1190-3లో నాలుగుసెంట్ల స్థలానికి పట్టా ఇచ్చారన్నారు. ఆ స్థలంలో ఇల్లు నిర్మిస్తుండగా ముదిగుబ్బ పంచాయతీ కార్యదర్శి అనుమతులు లేవంటూ నిర్మాణాన్ని నిలుపుదల చేయించారన్నారు. దీనిపై కోర్టుకు వెళ్లామని, కోర్టు పంచాయతీ అప్రూవల్ చేయాలని ఆదేశించినా అధికారులు స్పందించడంలేదన్నారు. నాలుగు రోజుల క్రితం మర్తాడు సర్పంచు కుళ్ళాయిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి మరికొంత మందితో వచ్చి స్థలం తమదంటూ మేస్త్రీని బెదిరించి పంపించివేశారన్నారు. ఎలాగైనా తమ స్థలాన్ని కబ్జా చేసేందుకు వైసీపీ నాయకులు కుతంత్రాలు పన్నుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.



ఇంటిపట్టా చూపుతున్న దంపతులు

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం



ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

తనకల్లు, ఏప్రిల్ 2: మండలపరిధిలోని మించలవారికోట గ్రామంలో మంగళవారం బాబు షుర్యూటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమానికి టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈఎన్నికల్లో టీడీపీకి ఎందుకు ఓటువేయాలోవివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్న జనం

గాండ్లపెంట, ఏప్రిల్ 2: ఎండ తీవ్రతకు బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. మూడు రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో ఇబ్బందిపడుతున్నారు. పనుల నిమిత్తం బయటకు వస్తే వడదెబ్బకు గురికావాల్సిన పరిస్థితి వస్తుందని జంకుతున్నారు. ప్రజలు బయటకు రాకపోవడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.



నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

దరఖాస్తుల ఆహ్వానం

నంబులపూలకుంట, ఏప్రిల్ 2: మండలకేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల11లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ రిహానా తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ సీఈసీకి అర్హులైన బాలికలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పలువురు వలంటీర్ల రాజీనామా

ధర్మవరం, ఏప్రిల్ 2: కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లో పలువురు వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ధర్మవరం మున్సిపాలిటీలో శివానగర్‌కు చెందిన 13 మంది వలంటీర్లు రాజీనామాలు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించారు.

నల్లమాడ: మండలంలోని వంకరకుంట సచివాలయ పరిధిలోని సానేవారిపల్లి, బసిరెడ్డిపల్లికి చెందిన 15మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మంగళవారం రాజీనామా లేఖను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులకు అందచేశారు.

రేపటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడి

నల్లచెరువు, ఏప్రిల్ 2: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఐసీడీపీఓ పీడీ శ్రీదేవి తెలిపారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న అడిషనల్ ఎస్పీ



స్వామివారి చిత్రపటాన్ని ఇస్తున్న దృశ్యం

నల్లచెరువు, ఏప్రిల్ 2: పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామిని మంగళవారం సత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ నాగభూషణరావు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని అందించారు. ఆలయచరిత్రను అర్చకులు వివరించారు.

'తాగునీటి సమస్య పరిష్కరించండి'



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లమాడ, ఏప్రిల్ 2: తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ మహమ్మద్‌దౌలా, తహసీల్దార్ నాగభూషణంకు మంగళవారం వినతిపత్రం అందించారు. నల్లమాడ బ్యాంక్ వద్ద ఉన్న ఇళ్లు, ఎద్దులవాండ్లపల్లి తండా తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, వెంటనే పరిష్కరించాలనికోరారు. సీపీఐ మండలకార్యదర్శి వెంకటరమణ, రైతు జిల్లా సహాయ కార్యదర్శి కుచ్చెపు చంద్ర, గంగాధర్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

నియామకం

ధర్మవరం, ఏప్రిల్ 2: బహుజన సమాజ్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సాకేవినయ్‌కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం ధర్మవరంలో సుబ్బరాయుడు ఈ మేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా మండలం నుంచి పలువురు యువకులు బీఎస్పీ చేరారు. సమావేశంలో బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాగరాజు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

గోరంట్ల, ఏప్రిల్ 2: మండలంలోని మల్లాపల్లి పంచాయతీకి చెందిన 23మంది వలంటీర్లు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వారంతా మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి ఎంపీడీఓ లేకపోవడంతో ఏఓ సూర్యనారాయణకు రాజీనామా పత్రాలను అందజేశారు.

పెనుకొండ రూరల్: పెనుకొండ మండలంలోని 23మంది వలంటీర్లు విధుల నుంచి మంగళవారం తప్పుకున్నారు. నాగలూరులో 13మంది వలంటీర్లు ఉండగా 12మంది, మావటూరులో 15మందికి గాను 11 మంది ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రాజీనామా పత్రాలను అందించినట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. అలాగే ఫోన్లు, డివైజ్‌లు అందించారని తెలిపారు.

విచారించి.. చర్యలు తీసుకుంటాం

ఏపీఆర్ఎస్ ఏజీఓ రాజేంద్రకుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఏపీఆర్ఎస్ ఏజీఓ

లేపాక్షి, ఏప్రిల్ 2 : స్థానిక మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థుల చేత సిబ్బంది వెట్టిచాకిరి చేయించడం, ప్రార్థనా సమయంలో మతాన్ని కించపరుస్తూ దండించడం వంటి విషయాలు తమ దృష్టికి వచ్చాయని... వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని గురుకుల పాఠశాల ఏజీఓ రాజేంద్రకుమార్ అన్నారు. ఆయన మంగళవారం జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలపై పలుమార్లు ఫిర్యాదులు అందాయని వాటిని విచారించడానికే వచ్చానన్నారు. విచారణ జరిపి ఎంతటి వారిపైన అయినా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ చాంబర్‌కు పిలిపించి రాతపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రసాద్ వివరణ తీసుకున్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోకుంటామని తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

గోరంట్ల, ఏప్రిల్ 2: మండలంలోని కొండాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర సామగ్రి పంపిణీ చేశారు. త్వరలో పరీక్షలు నిర్వహిస్తుండడంతో గ్రామానికి చెందిన భుజంగరావు 50మంది విద్యార్థులకు సామగ్రిని అందించారు. పంపిణీ కార్యక్రమంలో హెచ్ఎం సత్యవాణి, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రామచంద్ర, శ్రీనివాసమూర్తి, గీత, నందిని, శ్రీకళ విద్యార్థులున్నారు.

'కార్యకర్తలకు టీడీపీ అండ'

మడకశిర రూరల్, ఏప్రిల్ 2 : టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకండని పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని హరేసముద్రం పంచాయతీ కొండపల్లికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు చిక్క హనుమంతప్ప అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్నా సునీల్‌కుమార్ ఆ గ్రామానికి వెళ్ళి చిక్క హనుమంతప్ప భౌతిక కాయంపై పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అశ్వత్థామప్ప క్రిష్టప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని కలిపి మరువపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త లింగమ్మ(70) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆ పార్టీ నాయకులు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కలిపి హరిజనవాడలో టీడీపీ కార్యకర్త లక్ష్మీనరసప్ప అనారోగ్యంతో మృతిచెందగా నివాళులర్పించి, ఆ కుటుంబ సభ్యులను పరామర్శించా రు. పరామర్శించిన వారిలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు చిన్నప్పయ్య, నరసింహులు, మండల కన్వీనర్ నరహరి, గుర్రప్ప, కసప్ప తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనంలో ఉంచిన రూ.5.90 లక్షలు మాయం

గోరంట్ల, ఏప్రిల్ 2: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి మదు సూదన్‌రెడ్డి తన దిచక్రవాహనంలో ఉంచిన రూ.5.90లక్షల నగదును మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పట్టణంలోని ఎస్ వీవీఎం డిగ్రీ కళాశాలకు వెళ్లే రహదారిలో మధుసూ దన్‌రెడ్డి నివాసముంటున్నాడు. ఆయన, ఆయన భార్య సైదాబాను ఇద్దరూ ఉదయం 11.50నిమిషాలకు స్కూటీపై స్థానిక స్టేట్ బ్యాంకు కు వెళ్లారు. తన ఖాతా నుంచి రూ.50వేలు, భార్య ఖాతానుంచి రూ.5.40లక్షలు డ్రా చేశారు. ఆ సొమ్మును ఓ కవర్‌లో ఉంచి స్కూటీలో పెట్టారు. అయితే కుమారుడు కడుపునొప్పితో బాధపడు తున్నాడని ఫోన్ రావడంతో ఆయన తన భార్యను ఇంటి వద్ద దించి, నగదుతోపాటు స్కూటీపై స్థానిక చైతన్య పాఠశాల వద్దకు వెళ్లాడు. స్కూటీని పాఠశాల వద్ద ఉంచి లోపలికి వెళ్లి, తిరిగి వచ్చి చూసేసరికి నగదు మాయమైనట్లు ఆయన తెలిపాడు. అయితే బ్యాంకు వద్ద నుంచి రహదారి లోని సీసీ కెమెరాలను పరిశీలించగా... తమ వద్ద నగదు ఉన్న విషయా న్ని బ్యాంక్ వద్ద గుర్తిం చిన ఇద్దరు వ్యక్తులు తమను వెంబడించినట్లు తెలుస్తోందన్నారు. వారే చోరీకి పాల్పడి ఉంటారని బాధితుడు తెలిపారు. గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేబుల్ చోరీ

గుడిబండ, ఏప్రిల్ 2 : మండలంలోని మందలపల్లి, కొంకల్లు, ఎస్‌రాయాపురం గ్రామాల్లోని వ్యవసాయ బోరు, రక్షిత మంచినీటి పథకం బోర్ల కేబుల్ చోరీకి గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి సుమారు 10బోర్లలో కేబుల్ దొంగిలించడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రక్షిత నీటి పథకం బోరు కేబుల్ చోరీకి గురికావడంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దొంగతనాలకు పాల్పడేవారిపై నిఘా ఉంచి పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పింఛన్ సొమ్ముతో వైసీపీ నేతలకు బిల్లులు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



కోనాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న పార్థసారథి, సవిత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 2 : వైసీపీ బడానేతలకు బిల్లులు మంజూరు చేయడం వల్ల ఖజానా ఖాళీ అవడంతో ఈ నెల పింఛన్ల పంపిణీలో జరిగిందని ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శించారు. పింఛన్ల పంపిణీలో జాప్యానికి టీడీపీ పై నెపం నెట్టడం తగదని ఆమె అన్నారు. పెనుకొండ నగర పంచాయతీ లోని కోనాపురం, మంగాపురం, ఇస్లాపురం, కొండాపురం, తిమ్మాపురం, వెంకట రెడ్డిపల్లిల్లో టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత జనసేన, టీడీపీ నాయకులతో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో సవిత మాట్లాడుతూ... వైసీపీ నేతల బిల్లుల కోసం పింఛన్ల సొమ్ము కొల్లగొట్టిన ప్రభుత్వమని ఎద్దేవ చేశారు. టీడీపీ హయాంలో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పెనుకొండ చుట్టుప క్కల గ్రామాకు నీరందించామన్నారు. కానీ వైసీపీ ఐదేళ్లపాలనలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రం బాగు పడాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కోనాపురానికి రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని గ్రామస్థులకు హామీఇచ్చారు. మాజీ ఎంపీపీ కేశవయ్య, మునిమడుగు చిన్నవెంకట రాముడు, శ్రీరాములు యాదవ్, శోబన్‌గిరి, గీత, హనుమంతు, నారాయణస్వామి, రామలింగ, లక్ష్మీనారాయణరెడ్డి, గోపాల్‌నాయుడు, మిలిటరీ నారాయణప్ప, నారాయణ నాయక్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, విజయ్‌క్రిష్ణ, చైతన్య, హరినారాయణ చౌదరి, పెద్దన్న, కొల్లప్ప, సూర్యనారాయణ, జనసేన సమన్వయకర్త ఈడిగ కుమార్, రమేష్‌నాయుడు, తెలుగు మహిళలు చంద్రకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి

పెనుకొండ టౌన్ : రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె మంగళవారం టీడీపీ స్థానిక కార్యాలయంలో టీడీపీ, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో దళితులకు సరైన స్వేచ్ఛలేదని, అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులు చేసి, కేసులు పెడుతున్నారన్నారు. దళితులపై లెక్కలేనన్ని కేసులుపె ట్టారని, పలువురు హత్యకు గురయ్యారన్నారు.

క్రమశిక్షణ, దాతృత్వం కలయికే రంజాన్: బీకే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీకే పార్థసారథి

చిలమత్తూరు, ఏప్రిల్ 2: క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే పవిత్ర రంజాన్ మాసమని టీడీపీ హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారధి అన్నారు. చిలమత్తూరు మండల కేంద్రంలోని అబూబకర్ ఈద్గా మైదానంలో మంగళవారం రాత్రి ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఆయనతో పాటు హిందూపురం నియోజకవర్గ కోఆర్డినేట ర్ శ్రీనివాసరావు, గ్రీన్‌పార్కు నాగరాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా ముస్లిం పెద్దలు మసీదులో ప్రార్థనలు జరిపారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

అరటి తోటకు నిప్పు



అరటి తోటలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మడకశిర రూరల్, ఏప్రిల్ 2 : తన అరటి తోటకు నిప్పంటుకుని రూ.3 లక్షలు పంట నష్టం వాటిల్లినట్టు మం డలంలోని బుళ్ళసముద్రం గ్రామానికి చెందిన రంగనాథ్ అనే రైతు తెలిపారు. అరటి తోటకు నిప్పు అంటూకుని మంటలు ఎగసిపడుతుండడంతో చుట్టుపక్కల రైతులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి విజయకుమార్ వెంటనే అగ్నిమాపక యంత్రం, సిబ్బందితో వెళ్లి మంటలు ఆర్పినట్లు తెలిపారు. విజయకుమార్ మాట్లడుతూ రైతు రంగనాథ్ మూడు ఎకరాల్లో అరటి తోట సాగుచేశారన్నారు. దానికి డ్రిప్ సౌకర్యం కల్పించారు. అకతాయిలు ఎవరో మధ్యాహ్నం సమయంలో తోటకు నిప్పుపెట్టినట్లు తెలిపారు. వెంటనే తమకు సమాచారం రావడంతో వచ్చి మంటలను అదుపుచేసినట్లు తెలిపారు. రైతుకు రూ 3లక్షల వరకు పంట నష్టపోయినట్లు తెలిపారు.

వైసీపీ పాలనతో విసిగిపోయాం

జడ్పీటీసీ ఉమేష్

అగళి, ఏప్రిల్ 2: వైసీపీ దౌర్భాగ్యపు ప్రభుత్వంతో వేగలేకపోతున్నామని అగళి జడ్పీటీసీ ఉమేష్ విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వేసవి ప్రారంభంలోనే ఎండలు అధికమై గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రమైందన్నారు. పింఛన్ల పంపిణీ విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రేషన్ బియ్యం తూకాల్లో మోసం జరుగుతోందన్నారు. విద్యుత్ బిల్లులు పెంచారని, తాగునీటిని ఫిల్టర్ చేయకుండానే సరఫరా చేస్తున్నారన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా లెక్కచేయడం లేదన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం గురించి పట్టించుకోవడం లేదన్నారు. చివరకు మండలకేంద్రంలోని బస్టాండ్‌లో చెత్తకుప్పలను కూడా తొలగించలేదంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారు. ఏది ఏమైనా అధికార యంత్రాంగం గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు పుట్టపర్తిలో దివ్యాంగులకు వైద్య పరీక్షలు

గోరంట్ల, ఏప్రిల్ 2: దివ్యాంగులైన విద్యార్థులకు పుట్టపర్తిలోని భవిత కేంద్రంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో దివ్యాంగులకు వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు తదితరాలను పంపిణీ చేస్తారన్నారు. గోరంట్ల, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల దివ్యాంగులు హాజరుకావాలన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి: ఆర్ఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ గౌరీశంకర్

మడకశిరటౌన్, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున క్షేత్ర స్థాయిలో ఎన్నికల నియమావళి అమలయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత స్థానిక అధికారులపై ఉంటుందని ఆర్ఓ గౌరీశంకర్ అన్నారు. ఆయన మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో నియోజకవర్గం స్థాయి అధికారులు, వీఆర్ఓలు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు పబ్లిక్ ప్రాంతాల్లో, స్తంభాలపై ఉండకూడదన్నారు. వారి సొంత ఇళ్లపై పార్టీ జెండా కట్టినా అభ్యంతరం ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈసందర్భంగా ఐదు మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: నాయకులు



కగ్గల్లులో పథకాలపై వివరిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 2: నియోజకవర్గం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. హిందూపురం మండలంలోని కగ్గల్లు గ్రామంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, కన్వీనర్ అశ్వత్థ నారాయణరెడ్డి, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, నాయకులు రాము, హనుమంతు, ఆదినారాయణ, నారాయణరెడ్డి, మంజునాథ్, రామక్రిష్ణారెడ్డి, శ్రీరామప్ప, నాగన్న, ఉమాశంకర్‌రెడ్డి, ఆంజనేయులు, గోపాల్‌రెడ్డి, జయరాం, నంజుండప్ప తదితరులు ఉన్నారు.

టీడీపీతో అన్నివర్గాలకు న్యాయం



కోడూరు తోపులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, ఏప్రిల్ 2: అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మండలంలోని కోడూరు తోపు, తుమ్మలకుంట గ్రామాల్లో మంగళవారం హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి పార్థసారధికి మద్ద తుగా ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బేకరీ గంగాధర్, శ్రీదేవి, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, మీసేవ సూరి, గంగాధర్, కిష్టప్ప, శ్రీరామప్ప, వెంకటసుబ్బయ్య, చంద్ర, వెంకటేష్, నారాయణప్ప, అంజి, నరేష్, బాబు, హరీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఇరువైపులా పెరిగిన కంపచెట్లతో మణూరు-కల్లుమర్రి ప్రధాన రహదారి

మడకశిర రూరల్, ఏప్రిల్ 2: రహదారులు బాగుంటే రాకపోకలు సౌకర్యంగా ఉండి గ్రామాలు బాగా అభివృద్ధిచెందుతాయి. గడచిన నాలుగున్నరేళ్లలో గ్రామీణ రహదారుల అభివృద్ధి పడకేసింది. గ్రామాలకు మంచి రోడ్లు వేయిస్తామని పాలకులు హామీలు ఇచ్చారు. కానీ నేరవేర్చలేదు. హామీలు అలాగే మిగిలిపోయాయి. మండలంలో సరియైన రహదారులు లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. కొన్ని గ్రామాలకు సీపీ రోడ్డు వేస్తూ నిధుల కొరత కారణంగా పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. మరికొన్ని గ్రామాల్లో రహదారులు వేయడానికి అనుమతులు వచ్చినా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రా కపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. మణూరు నుంచి గంతలపల్లి, కల్లుమర్రి వేళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ఆ రహదారిలో రాకపోకలు పూర్తిగా నిల్చిపోయాయి. కొత్తలం నుంచి ఎగువ అచ్చంపల్లి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. వర్షాం వచ్చిందటే ఆ రహదారిలో రాకపోకలు బంద్. సీ కోడిగేపల్లి పంచాయతీలోని గ్రామాల్లో రహదారులు అన్నీ దెబ్బతిని గుంతల మయం అయ్యాయి. ఏల్లోటి గ్రామంలోకి వేళ్లే రహదారి గుంతమయం కావడంతో ఆటోలు కూడా సరిగా ఆ గ్రామానికి వెళ్లడంలేదు. మడకశిర నుంచి హరేసముద్రం, భక్తరహళ్లికి వేళ్లే రహదారులు పూర్తి దెబ్బతిన్నాయి. భక్తరహళ్లి నుంచి కర్ణాటక సరిహద్దు వరకు వేస్తున్న రోడ్డుకు నిధుల కొరత కారణంగా కంకర వేసి వదిలేశారు. ఆ రోడ్డు గుండా వెళ్లడానికి పాదాచారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని, భయందోళన చెందుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



గుంతలమయమైన మడకశిర-హరేసముద్రం వెళ్లే రహదారి



కంకరవేసి వదిలేసిన భక్తరహళ్లి - కర్ణాటక సరిహద్దు రహదారి

రాజకీయ లబ్ధి కోసమే పింఛన్ల పంపిణీలో జాప్యం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



ఎంపీడీఓ దాసరి మేరీకి వినతిపత్రం అందజేస్తున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఏప్రిల్ 2: పింఛన్ల పంపిణీని అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ ప్రభుత్వం కుట్రపన్నుతోందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ విమర్శించారు. సచివాలయాలు, పంచాయతీ సిబ్బందితో పంపిణీ చేసే అవకాశం ఉన్నా జాప్యం చేస్తోందన్నారు. సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలంటూ మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగన్ వైసీపీ నేతల కాంట్రాక్ట్ బిల్లులకు కాంట్రాక్టుకు సంబంధించి రూ.13వేల కోట్లు సర్దుబాటు చేసుకోవడంతో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందన్నారు. దీంతో పింఛన్లు పంపిణీ చేయలేక ప్రతిపక్షాలపై నెపం నెట్టుతున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం వలంటీర్లను కొనసాగిస్తామంటున్నారని, వారు వైసీపీ అనుకూలంగా పనిచేస్తే నష్టపోతారన్నారు. అనంతరం ఎంపీడీఓ దాసరి మేరీకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వత్థరామప్ప, బొజ్జప్ప, నాయకులు రామాంజనే యులు, ప్రకాష్, నాయకులు రాజగోపాల్, కిష్టప్ప, ఈశ్వర్‌సాగర్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు ఇవ్వాలి: మాజీ ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఏఫ్రిల్ 2: సకాలంలో పింఛన్లు అందించాల్సిన బాధ్యత వైసీపీ ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న అన్నారు. వైసీపీ నేతల లాభం కోసం ఖజానా ఖాళీ చేసి, పింఛన్ల పంపిణీ చేయడంలో జాప్యం చేస్తూ ప్రతిపక్షాలపై నెపం నెట్టడం ఎంతవరకు న్యాయం అన్నారు. ఈ మేరకు అమరాపురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో పింఛను పంపిణీ చేయించాలని ప్రతిపక్షాలు కోరితే, దాన్ని వక్రీకరించి చూపడం న్యాయం కాదన్నారు. ఇప్పటికైనా సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాలి

టీడీపీ నాయకుల వినతి

గోరంట్ల, ఏప్రిల్ 2: వృద్ధులు, దివ్యాంగ తదితర పింఛన్లను వారి ఇళ్లవద్దే అందించేలా చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు అధికారులను కోరారు. మండల కన్వీనర్ సోముశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఏఓ సూర్యనారాయణకు మంగళవారం వినతిపత్రం అందించారు. వలంటీర్లకు ప్రత్యామ్నాయంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్లవద్దే పింఛన్ అందించాలని కోరారు. .

పెనుకొండ టౌన్(సోమందేపల్లి) : వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇంటివద్దే పింఛన్ పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారంవినతిపత్రం అందించారు. నాయకులు నీరుగంటి చంద్ర, సురేష్, డీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : ఎన్నికల కోడ్ ఉన్నందున సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు కోరారు. వారు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు చిన్నప్పయ్య, నరసింహులు, మండల కన్వీనర్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

అగళి : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వలంటీర్లతో కాకుండా సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి తెలిపారు. టీడీపీ నాయకులు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రహిమాన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు చిదానందప్ప, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు అందించాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మండలకేంద్రంలోని సచివాలయంలో పంచాయతీ సెక్రెటరీకి వినితిపత్రం అందజేశారు. రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సూపర్‌సిక్స్ పథకాల పోస్టర్ల విడుదల

మడకశిరటౌన్, ఏఫ్రిల్ 2: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రైస్తవులకు ప్రత్యేకంగా రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాల పోస్టర్లను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న మంగళవారం పార్టీ కార్యాలయంలో చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 277 చర్చిలకు రూ.45కోట్లు అందించారన్నారు. విదేశీ విద్య పథకం కింద ఒక్కొక్కరికి రూ.15లక్షలు చొప్పున 68 మంది విద్యార్థులకు అందించారన్నారు. జెరూసలెం యాత్రకు 2500 మందిని పంపారన్నారు. సబ్సిడీ రుణాలను 4300 మందికి అందించి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టాక క్రైస్తవులకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను అందించి క్రైస్తవులను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి వైపు నడుపుతారన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప, అగళి మండల కన్వీనర్ కుమారస్వామి తదితరులు ఉన్నారు.

అందని ఉపాధి బిల్లులు

ఇబ్బందుల్లో కూలీలు

మడకశిర రూరల్, ఏప్రిల్ 2: జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేసిన పనులకు సకాలంలో బిలుల్లలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మండలంలోని పలు గ్రామాల కూలీలు వాపోతున్నారు. దీంతో తమ కుటుంబాలు పస్తులుండే పరిస్థితి నెలకొందని అంటున్నారు. మండలంలో ప్రస్తుతం 1400 మంది కూలీలు ఎండలను సైతం లెక్కచేయకుండా ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్నారు. అయితే మూడు నెలలుగా చేసిన పనులకు బిల్లులు అందలేదు. దీంతో కుటుంబపోషణ కష్టంగా మరిందని కూలీలు వాపోతున్నారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో కొంతమంది కూలీలు పనులు మానుకుని ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని వాపో యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని వెంటనే పెండింగు బిల్లులు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు. ఈ విషయమై ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. త్వరలో కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించ డానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం: సీడీపీఓ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లీశ్వరి

అగళి, ఏప్రిల్ 2 : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మడకశిర ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఆపదలో ఉన్న పిల్లలను రక్షించడానికి 1096, 112, 100, 181 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్, ఏఎస్ఐ శ్రీరాములు సూపర్‌వైజర్ లీలావతి, మహిళా పోలీస్ పద్మ, ఆర్‌డీటీ స్వచ్ఛంద సంస్థ ఉద్యోగి సరస్వతమ్మ, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.